# 'టీజీ' రాబడి 5 కోట్లు

- వారం రోజుల్లో ఆర్టీఏకు సమకూరిన ఆదాయం
- ఫ్యాన్సీ నంబర్లకు ఫుల్ డిమాండ్

హైదరాబాద్, మార్చి 22 (నమస్తే తెలంగాణ): వాహనాల రిజిస్ట్రేషన్‌లో 'టీజీ' ప్రారంభం కావడంతో ఆర్టీఏకు భారీగా ఆదాయం సమకూరుతున్నది. ఓ వైపు జోరుగా రిజిస్ట్రేషన్లు కొనసాగుతుండటం, మరోవైపు ఫ్యాన్సీ నంబర్ల కోసం పోటీ పెరుగుతుండటంతో ఆదాయం కూడా భారీగా వస్తున్నది. ఈ నెల 15 నుంచి వాహనాల రిజిస్ట్రేషన్లలో 'టీజీ' సిరీస్ ప్రారంభమైన విషయం తెలిసిందే. మొదటి రోజు రాష్ట్రవ్యాప్తంగా ఫీజుల ద్వారా రూ.1.25 కోట్లు రాగా.. ఫ్యాన్సీ నంబర్ల వేలం ద్వారా రూ.1.26 కోట్ల ఆదాయం వచ్చింది. వారం రోజుల ఆదాయాన్ని లెక్కిస్తే (గురువారం నాటికి) ఫీజుల ద్వారా రూ.3.10 కోట్లు, ఫ్యాన్సీ నంబర్ల వేలం ద్వారా రూ.2.48 కోట్లు వచ్చాయి. మొత్తం కలిపి రూ.5.59 కోట్లు సమకూరాయి.

**ఫ్యాన్సీ నంబర్లకు పోటాపోటీ..**

ఫ్యాన్సీ నంబర్లను దక్కించుకోవడానికి వాహనదారులు పోటీ పడుతున్నారు. టీజీ ప్రారంభమైన తొలిరోజే ఖైరతాబాద్ ఆర్టీఏ పరిధిలో టీజీ 09,0001 నంబర్ ఏకంగా రూ.9,61,111 పలకడం విశేషం. అలాగే టీజీ 09,0909 (రూ.2.30 లక్షలు), టీజీ 09,0005 (రూ.2.21 లక్షలు), టీజీ 09,0002 (రూ.1.2 లక్షలు) పలికాయి. మరోవైపు ఇప్పటికే స్లాట్ బుక్ చేసుకున్న వాహనదారులకు మాత్రం పాత టీఎస్ కోడ్ తోనే అధికారులు రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. మరోవారం రోజుల వరకు పాత స్లాట్లు నడుస్తాయని అధికారులు తెలిపారు. కొత్త వాహనాలు కొనుగోలు చేసిన వారికి మాత్రం టీజీ కోడ్ సిరీస్‌ను కేటాయిస్తున్నారు.

# 'ఎన్‌హెచ్‌ఎం' పెండింగ్ వేతనాలు విడుదల

హైదరాబాద్, మార్చి 22 (నమస్తే తెలంగాణ): నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కింద పనిచేస్తున్న దాదాపు 17 వేల మంది కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వం కొంత ఊరట కల్పించింది. పెండింగ్ వేతనాలను కొంతమేర విడుదల చేసింది. ఏఎన్‌ఎంలకు రెండు నెలలు, ఇతర సిబ్బందికి మూడు నెలలుగా వేతనాలు అందడం లేదు. దీంతో వారు శుక్రవారం నుంచి సమ్మెకు దిగుతామని ప్రకటించారు. దీనిపై ఫ్యామిలీ హెల్త్ శాఖ స్పందించింది. ఏఎన్‌ఎంలకు ఒక నెల, ఇతర సిబ్బందికి రెండు నెలల వేతనాలను జమ చేసింది. మరో నెల వేతనాలను పెండింగ్‌లో ఉంచింది. ఈ నేపథ్యంలో సమ్మె విరమిస్తున్నట్టు తెలంగాణ ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రకటించింది. శుక్రవారం యూనియన్ ప్రతినిధులు ఎన్‌హెచ్‌ఎం డైరెక్టర్ ఆర్వీ కర్ణన్‌ను కలిసి ధన్యవాదాలు తెలిపారు. మిగతా నెల జీతం విడుదల చేయడంతోపాటు ఇకపై ప్రతినెల ఒకటో తేదీన జీతాలు వేయాలని కోరారు. ఏడు నెలల పీఆర్సీ బకాయిలు కూడా విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ ఎన్‌హెచ్‌ఎం యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి శ్యామల, కోశాధికారి జై పద్మ, రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతి, తన్వీర్ సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి ఖమ్మంలో నామినేటెడ్ చిచ్చు

- భగ్గుమంటున్న అసంతృప్తవాదులు
- తారస్థాయికి చేరిన పదవుల లొల్లి

ఖమ్మం, మార్చి 22 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఉమ్మడి ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీలో నామినేటెడ్ పదవుల చిచ్చు రగులుకున్నది. పార్టీ కోసం ఏండ్ల తరబడి పనిచేసిన వారిని కాదని కొత్త వారికి పదవులు ఇస్తుండటంతో చాలా మంది అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తమ భవిష్యత్ ఏమిటని ఇటు సీనియర్, అటు ద్వితీయ శ్రేణి నాయకులు నిలదీస్తున్నారు. గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు నామినేటెడ్ పదవుల్లో ఖమ్మం జిల్లాకు ప్రాధాన్యం ఉండేదని, కానీ ఇప్పుడు ఆ గుర్తింపు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన కార్పొరేషన్ పదవుల్లో భద్రాద్రి జిల్లా నుంచి భద్రాచలం మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్యకు, ఖమ్మం జిల్లాకు చెందిన డీసీసీబీ మాజీ అధ్యక్షుడు మువ్వా విజయ్‌బాబుకు, కాంగ్రెస్ జిల్లా నాయకుడు రాయల నాగేశ్వరరావుకు, వైరాకు చెందిన నేతి శ్రీకాంత్‌కు, నాయుడు సత్యనారాయణలకు కార్పొరేషన్ పదవులు లభించాయి. అయితే, కాంగ్రెస్‌లో దశాబ్దాలుగా కొనసాగుతున్న నేతలకు అవకాశం లభించకపోవడంతో అసంతృప్తి పెల్లుబిక్కుతున్నది. కాంగ్రెస్ ఖమ్మం నగర అధ్యక్షుడు జావేద్‌కు కార్పొరేషన్ పదవి ఇవ్వకపోవడంపై ఆయన అభిమానులు భగ్గుమన్నారు. కార్పొరేషన్ పదవి ఇవ్వని పక్షంలో ఖమ్మం ఎంపీ టికెట్ అయినా కేటాయించాలంటూ కొద్దిరోజులుగా నిరసన వ్యక్తం చేస్తున్నారు. మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కాంగ్రెస్ నాయకులు మిక్కిలినేని నరేంద్ర, మానుకొండ రాధాకిశోర్, బిక్కా కృష్ణవేణి, నాగా సీతారాములుతోపాటు శాసనసభ ఎన్నికల ముందు కాంగ్రెస్‌లో చేరి తుమ్మల నాగేశ్వరరావు విజయంలో కీలకపాత్ర పోషించిన కమర్తపు మురళీ తదితరులకు నామినేటెడ్ పదవుల్లో అవకాశం లభిస్తుందని ప్రచారం జరిగింది. కానీ అలా జరగలేదు. దీంతో అసంతృప్తి తారస్థాయికి చేరింది.

# తెలంగాణ బీజేపీ నేతకు ఏపీలో టీడీపీ టికెట్

హైదరాబాద్, మార్చి 22 (నమస్తే తెలంగాణ): బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధిగా కొనసాగుతున్న నేతకు టీడీపీ ఏపీలో లోక్‌సభ టికెట్ కేటాయించడం చర్చనీయాంశంగా మారింది. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ డీజీపీగా పనిచేసిన టీ కృష్ణప్రసాద్ పదవీ విరమణ అనంతరం బీజేపీలో చేరారు. ప్రస్తుతం ఆయన బీజేపీ తెలంగాణ అధికార ప్రతినిధిగా కొనసాగుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కృష్ణప్రసాద్ బీజేపీ తరఫున కంటోన్మెంట్ టికెట్ ఆశించగా దక్కలేదు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో వరంగల్ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేయాలని ఆయన భావించారు. ఈ స్థానం ఆరూరి రమేశ్‌కు వెళ్లే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఊహించని విధంగా ఏపీలోని బాపట్ల లోక్‌సభ స్థానం నుంచి కృష్ణప్రసాద్‌ను తమ అభ్యర్థిగా టీడీపీ ప్రకటించింది. ఈ స్థానాన్ని ఇటీవలే వైసీపీ నుంచి టీడీపీలో చేరిన తాడికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి ఆశించగా, అనూహ్యంగా కృష్ణప్రసాద్‌కు టీడీపీ అధిష్ఠానం కేటాయించింది. దీనిపై బీజేపీ నేతలు ఆశ్చర్యం, ఒకింత విస్మయాన్ని వ్యక్తం చేసినట్టు తెలిసింది. కృష్ణప్రసాద్ ఇప్పటివరకు బీజేపీకి రాజీనామా కూడా చేయలేదని సమాచారం.

# విశాఖ డ్రగ్స్ కేసులోకి ఎన్ఐఏ ?

హైదరాబాద్, మార్చి 22 (నమస్తే తెలంగాణ) : విశాఖలో పట్టుబడిన భారీ డ్రగ్ రాకెట్‌లోకి జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) రంగ ప్రవేశం చేయనున్నది. ఈ మేరకు సీబీఐ సహకారంతో కేసును దర్యాప్తు చేయనున్నట్టు విశ్వసనీయ సమాచారం. దేశంలో భారీస్థాయిలో డ్రగ్స్ సరఫరా కావడం, యువతను మత్తు బానిసలను చేయాలనే కుట్ర కోణం ఉండటంతో ఎన్ఐఏ దర్యాప్తుకు అవకాశాలు ఉన్నట్టు తెలిసింది. ఎన్నికల వేళ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన విశాఖ డ్రగ్స్ వ్యవహారంలో సీబీఐ అధికారులు దూకుడు మరింత పెంచారు. కాకినాడ జిల్లాలో శుక్రవారం తనిఖీలు చేపట్టారు. 25 వేల కిలోల డ్రగ్స్ ఉన్న కంటైనర్ సంధ్య ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరిట బుక్ అయినట్టు సీబీఐ అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలోనే సంధ్య ఆక్వా ఎక్స్‌పోర్ట్స్‌కు సంబంధించి పలు చోట్ల తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం మూలపేటలో ఉన్న సంధ్య ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ కంపెనీలో ఏడుగురు సీబీఐ అధికారుల బృందం శుక్రవారం ఉదయం నుంచి తనిఖీలు చేపట్టింది. అధికారులు కంపెనీ సిబ్బందిని, కూలీలను అడిగి వివరాలు తెలుసుకొన్నారు. అలాగే వైజాగ్ నుంచి ఫోరెన్సిక్ బృందాన్ని రప్పించారు. ల్యాబ్‌లో ఉన్న వివిధ శాంపిల్స్ సేకరించి విశాఖపట్టణానికి తీసుకెళ్లినట్టు సమాచారం. కాకినాడ, ఒంగోలు, నెల్లూరు, ప్రకాశం, పశ్చిమగోదావరి జిల్లాలలో ఉన్న సంధ్య ఆక్వా కంపెనీల్లో సోదాలు జరుగుతున్నట్టు సమాచారం. మరోవైపు వైజాగ్‌లో దొరికిన 25 వేల కిలోల డ్రగ్స్ వ్యవహారం రాజకీయ రంగు పులుముకొన్నది. ఈ డ్రగ్స్‌తో మీకంటే మీకు సంబంధం ఉందంటూ వైసీపీ, టీడీపీ పరస్పర ఆరోపణలు గుప్పిస్తున్నాయి. ఎన్నికల వేళ ఇంతమొత్తంలో డ్రగ్స్ కంటైనర్ పట్టుబడటం ఇప్పుడు ఏపీ అంతటా హాట్‌టాపిక్‌గా మారింది. ఎన్నికల్లో డబ్బు కోసమే డ్రగ్స్ తరలిస్తున్నారంటూ పార్టీలు ఆరోపించుకొంటున్నాయి.

# పోస్టల్ అధికారి సుధీర్‌బాబు ఆస్తులు జప్తు

హైదరాబాద్, మార్చి 22 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ సిటీ డివిజన్ పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లోని సీనియర్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న కే సుధీర్‌బాబు, అతని అనుచరులు వద్ది నర్సిరెడ్డి, టీ నితిన్, ఎం సుదర్శన్‌లకు చెందిన రూ.6.57 లక్షల ఆస్తులను జప్తు చేసినట్టు ఈడీ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నోట్ల రద్దు సమయంలో కే సుధీర్‌బాబు ఇతర నిందితులతో కలిసి రూ.3.75 కోట్లను కొత్త నోట్లుగా నిబంధనలకు విరుద్ధంగా మార్చారని పేర్కొన్నారు. ఇందుకు సుమారు రూ.87 లక్షల కమీషన్ కూడా తీసుకొన్నట్టు విచారణలో తేలినట్టు ఈడీ అధికారులు తెలిపారు.


**దక్షిణ మధ్య రైల్వే**

Follow us on @SCRailwayIndia ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.inపై చూడవచ్చును

**బహిరంగ వేలం**

భారత రాష్ట్రపతి తరపున సుమారు 110 టన్నుల బరువుగల క్లెయిమ్ చేయబడని ఆఫ్ లోడెడ్ బొగ్గు కాజీపేట్ హంప్ యార్డ్ వద్ద నిల్వ చేయబడినది. అది **కాజీపేట్ రైల్వే స్టేషన్ వద్ద 27 మార్చి, 2024న 11.00 గంటలకు బహిరంగ వేలం** ద్వారా విక్రయించబడుతుంది. సవివరమైన వేలం ప్రకటన కొరకు మా వెబ్‌సైట్: **www.scr.indianrailways.gov.in**లో "tenders" చూడగలరు.

A0387 **సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్, సికింద్రాబాద్.**


# రాత్రికి రాత్రే హైకోర్టు పనులకు శ్రీకారం

- విద్యార్థి సంఘాలపై పోలీసుల డేగ కన్ను
- రెండు నెలల పోరాటమంతా వృథా
- దాదాపు రూ.వెయ్యి కోట్ల మేర అదనపు భారం
- 'రియల్' బూమ్ కోసమే ప్రభుత్వ ప్రాధాన్యం



ఉద్యాన తోటల తొలగింపు దృశ్యం

వ్యవసాయ యూనివర్సిటీ, మార్చి 22: విద్యార్థుల, ప్రజాసంఘాల పోరాటం పట్టలేదు.. ప్రతిపక్షాల సూచనలనూ వినలేదు.. పర్యావరణ వేత్తల సలహాలు పాటించలేదు.. బార్ అసోసియేషన్ ప్రశ్నలు, వర్సిటీల వినతులు పట్టించుకోనేలేదు.. తాను కోరిందే వేదంగా భావించిన ప్రభుత్వం రాత్రికి రాత్రే హైకోర్టు పనులకు శ్రీకారం చుట్టడం విమర్శలకు తావిచ్చింది. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లో 40 ఏండ్ల చరిత్రను నీరు గార్చి, వర్సిటీ భూముల్లోని సహజ వనరులను తొలగించే పనిలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిమగ్నమైంది. భారీ వన సంపదను నాశనం చేస్తున్నది. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలో ఏండ్ల తరబడి పెంచిన తల్లిలాంటి వనమూలికలు, ఔషధ, వివిధ పండ్ల తోటలు, పలురకాల వనాలను కూల్చివేస్తున్నారు. శుక్రవారం రాత్రి గుట్టుచప్పుడు కాకుండా వాటిని తొలగించేదుకు జేసీబీ, హిటాచి లాంటి భారీ యంత్రాలను తరలించారు. ఉద్యమకారులు అడ్డుపడకుండా ఎప్పటికప్పుడు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

**సీఎంకు ప్రత్యేక ఆసక్తి: బార్ అసోసియేషన్లు**

ఇంకో వందేండ్ల వరకు సేవ చేసే భవనాన్ని వదిలి, కొత్త భవనం కట్టాల్సిన అవసరమేమిటని వివిధ బార్ అసోసియేషన్లు ప్రశ్నించాయి. దీనిని ఏకపక్షంగా, తొందరపాటు చర్యగా అభివర్ణించాయి. ఇప్పుడున్న చోట రూ.100 కోట్లు కేటాయించి కనీస వసతులు కల్పిస్తే సరిపోతుందని సూచించారు. దీనివెనుక సీఎంకు ప్రత్యేక ఆసక్తి ఉన్నదని, రియల్ బూమ్ కోసం ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తున్నారు. కొత్తగా నిర్మిస్తే దాదాపు రూ.వెయ్యి కోట్లు వృథా అవుతాయని సూచించారు. వ్యవసాయ, ఉద్యాన వర్సిటీల భూములను బలవంతంగా వారి నుంచి లాక్కొని హైకోర్టు భవనాలు కట్టడం భావ్యం కాదన్నారు. అటు రైతులకు, వ్యవసాయ పరిశోధనలకు, వర్సిటీ విద్యార్థులకు తీవ్ర నష్టం కలుగుతుందని పేర్కొన్నారు. హైకోర్టును ఇక్కడే కొనసాగించాలని, జీవో నం.55ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

**హైదరాబాద్‌కు ఊపిరితిత్తులు**

బయో డైవర్సిటీ పార్కును, పరిశోధనా భూములను నేలమట్టం చేయడానికి ఏ ముందు చూపు ఉన్నవారైనా అంగీకరించరని మేధావి వర్గం సూచించింది. 100 ఎకరాల బయో డైవర్సిటీ భూమి విలువ రూ.6 లక్షల కోట్లు ఉంటుందని, అవి హైదరాబాద్ ప్రజల ఊపిరితిత్తులు అని వారు పేర్కొంటున్నారు. హైదరాబాద్ ప్రజలకు విలువైన ఆక్సిజన్‌ను అందిస్తున్నాయని చెప్పారు. ఈ చర్యతో మనం చరిత్రహీనులుగా మిగిలి పోతామని హెచ్చరించారు. భవిష్యత్తు తరాలకు వర్సిటీ ప్రాముఖ్యత పుస్తకాలకే పరిమిత మవుతుందని ఆందోళనతో విద్యార్థి సంఘాలు దాదాపు రెండు నెలలపాటు ధర్నాలు, నిరసనలు తెలిపారు. వాటిని పెడచెవిన పెట్టిన ప్రభుత్వం సహజ వనరులను నాశనం చేసి చరిత్ర పుటానికి ఎక్కబోతుందనేది సత్యమని వివిధ వర్గాలు భావిస్తున్నాయి.

# కేకే, విజయలక్ష్మితో దీపాదాసు మున్షీ భేటీ

హైదరాబాద్, మార్చి 22 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, రాజ్యసభ సభ్యుడు కే కేశవరావు, ఆయన కుమార్తె, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మితో ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాసు మున్షీ, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి భేటీ అయ్యారు. శుక్రవారం వీరింటికి వచ్చిన కాంగ్రెస్ నేతలు కాసేపు చర్చించారు. కాంగ్రెస్‌లో చేరాల్సిందిగా వీరిద్దరిని ఆహ్వానించినట్టు సమాచారం. అయితే ఇందుకు కే కేశవరావు ఒప్పుకోలేదని, విజయలక్ష్మి మాత్రం ఆలోచించి చెప్తానని అన్నట్టు తెలిసింది.

# యాసంగి లక్ష్యం 75.2 లక్షల టన్నులు

హైదరాబాద్, మార్చి 22 (నమస్తే తెలంగాణ): ఈ యాసంగి సీజన్‌లో 75.2 లక్షల టన్నుల ధాన్యం సేకరించాలని పౌర సరఫరాల శాఖ లక్ష్యంగా పెట్టుకున్నది. ఏప్రిల్ 1 నుంచి కొనుగోళ్లు ప్రారంభించాలని నిర్ణయించినట్టు అధికారులు తెలిపారు. ఈ యాసంగిలో 66.06 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుండగా, 120.91 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా. ఇందులో ప్రైవేట్ వ్యాపారులు, మిల్లర్లకు అమ్మకాలు, రైతుల సొంత అవసరాలకు పోనూ సగం వరకు కొనుగోలు కేంద్రాలకు వస్తాయని అధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో 75.2 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని టార్గెట్ పెట్టుకున్నారు. నిరుడు యాసంగిలో 68.84 లక్షల టన్నులు కొనుగోలు చేశారు. ఈసారి 7,149 సెంటర్లలో ధాన్యం సేకరణ జరపాలని నిర్ణయించారు.

# అధికారుల వేధింపులకు రైతు బలి

- వ్యవసాయ బావి వద్ద చెట్టుకు ఉరేసుకొని రైతు రఘుపతి బలవన్మరణం
- మృతదేహంతో తహసీల్దార్ కార్యాలయం ఎదుట బంధువుల బైఠాయింపు
- జనగామ జిల్లా బచ్చన్నపేటలో ఘటన



జనగామ జిల్లా బచ్చన్నపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతు రఘుపతి మృతదేహంతో ధర్నా చేస్తున్న బంధువులు, గ్రామస్థులు

జనగామ, మార్చి 22 (నమస్తే తెలంగాణ) : రెవెన్యూ అధికారుల వేధింపులకు ఓ రైతు బలయ్యాడు. వ్యవసాయ భూమి రిజిస్ట్రేషన్ కోసం లక్షలాది రూపాయలు తీసుకొని పని చేయకపోగా.. డబ్బులు తిరిగి అడిగినందుకు వేధింపులకు గురిచేయడంతో మనస్తాపంతో ఆ రైతు పొలం వద్ద చెట్టుకు ఉరేసుకొని ప్రాణాలు వదిలాడు. ఈ ఘటన శుక్రవారం జనగామ జిల్లాలో చోటుచేసుకున్నది. బంధువులు, గ్రామస్థులు బచ్చన్నపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట పెద్దఎత్తున ధర్నాకు దిగారు. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా.. బచ్చన్నపేట మండలం పడమటి కేశ్వాపూర్‌కు చెందిన రైతు కొమ్మాటి రఘుపతి (45)కి గ్రామంలోని వ్యవసాయ బావి పక్కన ఉన్న ఎకరం 20 గుంటల భూమి ఇతరుల పేరిట రిజిస్ట్రేషన్ కావడంతో దాన్ని తన పేరిట రిజిస్ట్రేషన్ చేయిస్తానంటే అప్పు తెచ్చి మరీ తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ సుమన్, మండల సర్వేయర్ రవీందర్‌కు రూ.4.50 లక్షలు లంచంగా ముట్టజెప్పాడు. రెండేండ్ల క్రితం డబ్బులు తీసుకొని కూడా భూమిని తన పేరిట రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో విసిగిపోయిన బాధిత రైతు అప్పుగా తెచ్చి ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వాలని రెవెన్యూ అధికారులను పలుమార్లు వేడుకున్నాడు. డబ్బులు ఇవ్వకపోగా వేధింపులకు పాల్పడి వ్యక్తిగతంగా బెదిరింపులకు దిగడం, అప్పు తీసుకొచ్చిన దగ్గర వడ్డీ, అసలు పెరిగి పోతుండటంతో తీవ్ర మనస్తాపానికి గురైన రఘుపతి శుక్రవారం వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య శ్యామల, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. రఘుపతి మృతికి రెవెన్యూ అధికారులే కారణమని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు పెద్దఎత్తున బచ్చన్నపేట తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొన్నారు. అక్కడ రఘుపతి మృతదేహంతో బైఠాయించారు. రైతు ఆత్మహత్యకు కారకులైన సీనియర్ అసిస్టెంట్ సుమన్, మండల సర్వేయర్ రవీందర్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు జోక్యం చేసుకొని డబ్బులు తిరిగి ఇప్పించడంతోపాటు బాధిత కుటుంబానికి తగిన న్యాయం చేస్తామని రెవెన్యూ ఉన్నతాధికారులు హామీతో ఆందోళన విరమించారు.

# 23 నుంచి గ్రూప్-1 దరఖాస్తుల సవరణ

హైదరాబాద్, మార్చి 22 (నమస్తే తెలంగాణ) : గ్రూప్-1 దరఖాస్తుల్లో దొర్లిన తప్పులను ఈ నెల 23 నుంచి 27 సాయంత్రం 5 గంటల వరకు సవరించుకోవచ్చని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ తెలిపారు. గ్రూప్-1 ఉద్యోగాలకు దరఖాస్తుల నమోదు గడువు ఈ నెల 16న ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా గ్రూప్-1 పోస్టులకు 4.03 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకొన్నట్టు కమిషన్ అధికారులు వెల్లడించారు.

# పోస్టులను తగ్గించి చూపితే ఊరుకోం

- ఉన్నతస్థాయి కమిటీతో ఖాళీల సంఖ్య తేల్చాలి
- ఎంపీ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కృష్ణయ్య

ముషీరాబాద్, మార్చి 22: ఉన్నత స్థాయి కమిటీని నియమించి రాష్ట్రంలో ఉద్యోగ ఖాళీల సంఖ్యను తేల్చాలని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖాళీలపై స్పష్టత వచ్చాకే ఉద్యోగ నోటిఫికేషన్లు వేయాలని ఆయన కోరారు. హైదరాబాద్ విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో బీసీ ఐక్యవేదిక అధ్యక్షుడు అనంతయ్య, కరుణశ్రీ అధ్యక్షతన శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోస్టుల సంఖ్యను తగ్గిస్తూ ఉద్యోగ నోటిఫికేషన్లు వేస్తుంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. గ్రూప్-1 సర్వీసెస్‌లో 1,600 పోస్టులకు 503, గ్రూప్-2లో 2,200కు గాను 783, గ్రూప్-3లో 3 వేలకు బదులు 1,383, గ్రూప్-4లో 8,500, 25 వేల టీచర్ పోస్టులకు బదులు 11 వేలకే నోటిఫికేషన్ ఇచ్చి అరకొర నియామకాలతో ప్రభుత్వం చేతులు దులుపుకోవాలని చూస్తున్నదని ధ్వజమెత్తారు. కొందరు ఉన్నతాధికారులు డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ఖాళీలను లెక్కించడంలో సరిగా వ్యవహరించడం లేదని, ఖాళీలను తక్కువగా చూపుతున్నారని మండిపడ్డారు.

# ఏసీబీ వలలో సీతక్క దోస్త్!

మొదటిపేజీ తరువాయి...

మేరకు కార్యాలయ అవుట్ సోర్సింగ్ ఉద్యోగి ఆలేటి వెంకటేశ్‌ను కలువగా.. ప్రభుత్వ ధర ప్రకారం గజానికి రూ.100 ఉంటుందని, కానీ ఇక్కడ మాత్రం గజానికి రూ.200 చొప్పున ఇస్తేనే రిజిస్ట్రేషన్ చేస్తామని వెంకటేశ్ చెప్పాడు. దీంతో హరీశ్ మళ్లీ సబ్ రిజిస్ట్రార్‌ను కలిశాడు. మొత్తం రూ.19,200 ఇస్తేనే రిజిస్ట్రేషన్ చేస్తామని చెప్పింది. వెంటనే ఆయన వరంగల్ ఏసీబీ అధికారులను సంప్రదించాడు. ఒప్పందంలో భాగంగా హరీశ్ శుక్రవారం కార్యాలయానికి వెళ్లి సబ్ రిజిస్ట్రార్ తస్లీమాకు డబ్బులు ఇవ్వబోయాడు. ఆఫీస్‌లో పనిచేసే వెంకటేశ్‌కు ఇవ్వాలని ఆమె సూచించడంతో బాధితుడు హరీశ్ రూ.19,200ను వెంకటేశ్‌కు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వెంకటేశ్ వద్ద రూ.19,200లతోపాటు అదనంగా 1.72 లక్షలు లభించాయి. అదనపు డబ్బులు ఎవరి నుంచి తీసుకున్నాడనే వివరాలు ఇంకా తెలియరాలేదు. కార్యాలయంలో సోదాలు కూడా నిర్వహించారు. కేసు నమోదు చేసిన ఏసీబీ అధికారులు సబ్ రిజిస్ట్రార్ తస్లీమాతోపాటు అవుట్ సోర్సింగ్ ఉద్యోగి వెంకటేశ్‌పై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచనున్నట్టు ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపారు.



ఏసీబీకి పట్టుబడిన మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి వెంకటేశ్

**అవినీతి మార్గం.. సేవ పేరుతో ప్రచారం**

అవినీతిని మార్గంగా ఎంచుకొని సేవ పేరుతో ప్రచారం పొందుతున్న మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్ మహమ్మద్ తస్లీమా నస్రీన్ నైజం బయటపడింది. తస్లీమాకు ఉద్యోగం వచ్చిన తర్వాత ములుగు జిల్లా సబ్ రిజిస్ట్రార్‌గా 12 ఏండ్లు అక్కడే విధులు నిర్వహించింది. గత ఏడాది బదిలీల్లో భాగంగా మహబూబాబాద్‌కు వచ్చింది. ప్రభుత్వ సెలవులు వస్తే చాలు మహిళలతో కలిసి నాట్లు వేయడం, పత్తి ఏరడం, మిర్చి తెంపడం వంటి కార్యక్రమాలు చేస్తూ సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం చేసుకుంటుంది. కార్యాలయానికి వచ్చే సమయంలో ఆటో, బస్సు, ద్విచక్ర వాహనాల్లో ప్రయాణం చేస్తూ విస్తృత ప్రచారం చేస్తుంది. ఈమె ఒక ట్రస్ట్ ఏర్పాటు చేసి అనాథ పిల్లలకు దుస్తులు పంపిణీ చేయడం, ఎవరైనా మరణిస్తే వారి ఇంటికి వెళ్లి 25 కిలోల బియ్యం బస్తా, నగదు ఇచ్చి ఫొటోలు దిగడం వాటిని సోషల్ మీడియాలో షేర్ చేయడం చేస్తుంటుంది. తస్లీమా మరో కోణంలో రాజకీయ నాయకులకు, ప్రజా ప్రతినిధులతో సెల్ఫీలు దిగుతూ బాబాయ్, తమ్ముడు అంటూ వరుసలు కలిపేస్తుంది. ఏసీబీ అధికారుల దాడుల్లో తస్లీమా అసలు నైజం బయటపడింది.

# నామినేటెడ్ హామీతో మెత్తబడ్డ సంపత్

- ముఖ్యమంత్రి వద్దకు తీసుకెళ్లిన మల్లు రవి
- మిలాఖత్‌ను జీర్ణించుకోలేక పోతున్న అనుచరులు

హైదరాబాద్, మార్చి 22 (నమస్తే తెలంగాణ)/మహబూబ్‌నగర్, (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కాంగ్రెస్ పార్టీలో మాదిగలను అణచివేస్తున్నారంటూ ఏకంగా సోనియాగాంధీకి లేఖ రాసిన మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ చివరకు రాజీ పడ్డారు. 'మల్లు రవిని గెలిపించండి.. మంచి పోస్టు ఇచ్చే పూచీ నాది' అని పీసీసీ అధినేత, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇవ్వడంతో మెత్తబడ్డారు. దీంతో నాగర్‌కర్నూల్ ఎంపీ టికెట్ విషయంలో తలెత్తిన వివాదం ముగిసినట్టేనని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో అలంపూర్ నియోజకవర్గంలో ఓటమిపాలైన సంపత్‌కుమార్‌తోపాటు, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సోదరుడు మల్లు రవి నాగర్‌కర్నూల్ (ఎస్సీ రిజర్వ్) ఎంపీ టికెట్ కోసం పోటాపోటీగా ప్రయత్నించారు. నాగర్‌కర్నూల్ ఎంపీ స్థానంపై గురిపెట్టిన మల్లు రవి చివరకు ఢిల్లీలో ప్రభుత్వ అధికార ప్రతినిధి పదవిని సైతం వదులుకున్నారు. ఇదే టికెట్‌ను ఆశించిన సంపత్‌కుమార్ కూడా ఢిల్లీలో గట్టి ప్రయత్నాలే చేశారు. నియోజకవర్గంలో కూడా ఇరువర్గాలు పోటాపోటీగా బ్యానర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటుచేశాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీలో మాదిగలను అణచివేస్తున్నారంటూ ఏకంగా సోనియాగాంధీకి సంపత్‌కుమార్ లేఖ రాయడమే కాకుండా దానిని మీడియాకు విడుదల చేయడంతో పరిస్థితి మరింత వేడెక్కింది. ఇది జరిగిన కొద్ది సేపటికే అధిష్ఠానం మల్లు రవికి టికెట్ ఖరారు చేసింది. దీంతో కంగుతిన్న సంపత్‌కుమార్ అనుచరులు ఆందోళనలకు సిద్ధమవుతుండగా శుక్రవారం అనూహ్య పరిణామం జరిగింది. కాంగ్రెస్ అధిష్ఠానం సంపత్‌కుమార్‌ను బుజ్జగించే బాధ్యతను మల్లు రవికి అప్పగించింది. దీంతో మంత్రి జూపల్లి కృష్ణారావును వెంటబెట్టుకొని మల్లు రవి శుక్రవారం ఉదయం సంపత్‌కుమార్ ఇంటికి వెళ్లి మంతనాలు జరిపారు. తన విజయానికి సహకరిస్తే పార్టీ పెద్దలను ఒప్పించి రాష్ట్రస్థాయి నామినేటెడ్ పోస్టు ఇప్పిస్తానని మల్లు రవి చెప్పినప్పటికీ సంపత్‌కుమార్ అందుకు అంగీకరించలేదని తెలిసింది. నామినేటెడ్ పోస్టు ఇస్తానని సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా హామీ ఇస్తే, అప్పుడు ఆలోచిస్తానని సంపత్‌కుమార్ తేల్చి చెప్పినట్టు సమాచారం. దీంతో మంత్రి జూపల్లి, మల్లు రవి ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, సంపత్‌ను తన వద్దకు తీసుకురమ్మని సూచించినట్టు తెలిసింది. దీంతో వారు సంపత్‌కుమార్‌ను వెంటబెట్టుకొని సీఎం ఇంటికి వెళ్లారు. అయితే, తనకు నామినేటెడ్ పోస్టు ఇస్తారన్న గ్యారెంటీ ఏమున్నదని సంపత్ ప్రశ్నించినట్టు ఆయన సన్నిహిత వర్గాల ద్వారా తెలిసింది. నామినేటెడ్ పోస్టు ఇచ్చే బాధ్యత తనేదనని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇవ్వడంతో సంపత్‌కుమార్ తలొగ్గక తప్పలేదని ఈ వర్గాల సమాచారం. రాష్ట్రస్థాయిలో గుర్తింపు వచ్చే పోస్టు ఇవ్వాలని సంపత్ కోరగా, అందుకు సీఎం సానుకూలంగా స్పందించినట్టు తెలిసింది. తాను పెట్టిన షరతులకు ఒప్పుకున్న తర్వాతనే, మల్లు రవి విజయానికి కృషి చేస్తానని సంపత్‌కుమార్ ప్రకటించడం వెనుక ఇంత కథ జరిగినట్టు ఆ పార్టీ వర్గాల సమాచారం. అయితే, నియోజకవర్గంలోని సంపత్‌కుమార్ అనుచరులు మాత్రం మల్లు రవితో మిలాఖత్ కావడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు.

# టెట్ రాయాలంటే వెయ్యి కొట్టు!

- ఒక్కో పేపర్‌కు రూ.వెయ్యి
- సర్వీస్ టీచర్లకూ అవకాశం
- గత ఏడాది రూ.400 మాత్రమే

హైదరాబాద్, మార్చి 22 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని నిరుద్యోగుల నడ్డి విరుస్తూ టెట్ ఫీజును ప్రభుత్వం భారీగా పెంచేసింది. ఒక్కో పేపర్‌కు ఫీజును రూ.వెయ్యిగా నిర్ధారించింది. రెండు పేపర్లు రాయాలంటే రూ.2 వేలు చెల్లించాల్సిందేనని స్పష్టం చేసింది. ఈ మేరకు శుక్రవారం విద్యాశాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నెల 27 నుంచి ఏప్రిల్ 10 వరకు schooledu.telangana.gov.in వెబ్‌సైట్‌లో లాగిన్ అయ్యి దరఖాస్తులు సమర్పించాలని తెలిపింది. టెట్‌ను మే 20 నుంచి జూన్ 3 వరకు 15 రోజులపాటు ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నట్టు వెల్లడించింది. సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులు కూడా ఈ టెట్‌కు హాజరయ్యే వెసులుబాటు కల్పిస్తున్నది. డీఈడీ పూర్తి చేసినవారు మాత్రమే టెట్ పేపర్-1కు అర్హులు. పేపర్-2కు డిగ్రీ బీఈడీ ఉండాలి. జనరల్ అభ్యర్థులకు డిగ్రీలో 50%, ఇతరులకు 45% మార్కులు వచ్చి ఉండాలి. 2015 లోపు అయితే జనరల్‌కు 50%, ఇతరులకు 40% ఉన్నవారు కూడా అర్హులే.

**తగ్గించకపోతే ఉద్యమం**

కాంగ్రెస్ అధికారంలో వస్తే పరీక్ష ఫీజులు ఉండవు అని చెప్పి, ఇప్పుడు దేశంలోనే అత్యధికంగా ఒక్కో పేపర్‌కు రూ.వెయ్యి వసూలు చేయటం దారుణం. ఇది 4 లక్షల మంది అభ్యర్థులను మోసం చేయడమే. వెంటనే ఫీజు తగ్గించాలి. లేదంటే పెద్దఎత్తున ఆందోళన చేస్తాం. టెట్ ఆన్‌లైన్ ద్వారా కాకుండా ఆఫ్‌లైన్ విధానంలో నిర్వహించాలి.

- రావుల రామ్మోహన్‌రెడ్డి, రాష్ట్ర డీఈడీ, బీఈడీ అభ్యర్థుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

**ఊరట కల్పిస్తామని.. ఫీజు బాదుడు**

నిరుద్యోగుల నుంచి అధిక ఫీజులు వసూలు చేయకుండానే పోటీ పరీక్షలు నిర్వహిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పింది. కానీ ఇప్పుడు భారీగా ఫీజు పెంచింది. టెట్ ప్రారంభమైనప్పటి నుంచి ఈ స్థాయిలో ఫీజులు వసూలు చేయటం ఇదే తొలిసారి. టెట్ ప్రారంభంలో రూ.200 మాత్రమే వసూలు చేశారు. ఆ తర్వాత రూ.300కు పెరిగింది. గత ఏడాది ప్రభుత్వం నిర్వహించిన టెట్‌కు రూ.400 ఫీజు వసూలు చేసింది. కానీ ఇప్పుడు ఏకంగా రెండున్నర రెట్లు పెంచడంతో నిరుద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# మే 7 నుంచి ఎప్‌సెట్

హైదరాబాద్, మార్చి 22 (నమస్తే తెలంగాణ) : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో టీఎస్ ఎప్‌సెట్ (ఇంజినీరింగ్, ఫార్మసీ, నర్సింగ్), ఐసెట్ షెడ్యూల్‌ను మార్చినట్టు రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆర్ లింబాద్రి తెలిపారు. ఎప్‌సెట్ అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో మే 7, 8న, ఇంజినీరింగ్ విభాగంలో మే 9, 10, 11న ఉదయం, సాయంత్రం రెండు పూటలు పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. జూన్ 5, 6న ఐసెట్ నిర్వహించాలని నిర్ణయించినట్టు పేర్కొన్నారు. టీఎస్ ఐసెట్ ప్రవేశ పరీక్షలను జూన్ 5, 6న నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు లింబాద్రి ప్రకటించారు.

# 'నిపుణ'లో గ్రూప్స్ తరగతులు

హైదరాబాద్, మార్చి 22 (నమస్తే తెలంగాణ) : గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3 పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థుల సౌకర్యార్థం ఆన్‌లైన్ ఓరియంటేషన్ తరగతులు నిర్వహించనున్నట్టు టీశాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. శనివారం ఉదయం నుంచే నిపుణ చానల్‌లో ఉదయం 11 గంటల నుంచి 12 గంటలకు ప్రత్యక్ష ప్రసారం ద్వారా అనుభవం ఉన్న సిబ్బందితో బయాలజీ సబ్జెక్టుపై అవగాహన కార్యక్రమం ఉన్నదని తెలిపారు.

# విద్యుత్తు ఉత్పత్తి ప్రాజెక్టులను జెన్‌కోతో నిర్మించాలి

**జెన్‌కో సీఎండీకి ఉద్యోగుల జేఏసీ విజ్ఞప్తి**

హైదరాబాద్, మార్చి 22 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ప్రభుత్వం త్వరలో నిర్మించబోయే విద్యుత్తు ఉత్పత్తి ప్రాజెక్టులన్నింటినీ జెన్‌కో ద్వారానే చేపట్టాలని విద్యుత్తు ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం జెన్‌కో సీఎండీ రిజ్వీని తన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యుత్తు ఉద్యోగులు సీఎండీ దృష్టికి పలు విషయాలు తీసుకెళ్లారు. గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్ట్రిబ్యూషన్ కంపెనీలను ప్రభుత్వం రంగంలో కొనసాగించిందని గుర్తుచేశారు. ప్రస్తుత ప్రభుత్వం అన్ని థర్మల్ విద్యుత్తు, జల విద్యుత్తు, సోలార్ విద్యుత్తు ప్రాజెక్టులను జెన్‌కో ద్వారానే నిర్మించాలని కోరుతున్నట్టు తెలిపారు. సీఎండీ స్పందిస్తూ..విద్యుత్తు ఉద్యోగుల జేఏసీ విజ్ఞప్తుల మేరకు జెన్‌కోకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకొంటామని హామీనిచ్చారు. సీఎండీని కలిసిన వారిలో తెలంగాణ విద్యుత్తు జేఏసీ నాయకులు వెంకటేశ్వర్లు, రత్నాకర్‌రావు, ప్రభాకర్‌గౌడ్, బీ సీ రెడ్డి, వజీర్, సీ సదానందం, కే కుమారస్వామి, సంపత్‌రెడ్డి, కుమారస్వామి, కరుణ్‌కర్ రెడ్డి, తులసీ నాగవాణి, నెహ్రూ, రామగుండం చెందిన శంకరయ్య, శ్రీనివాసు తదితరులు ఉన్నారు.